సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 17 । జూన్ । 2024



అంతర పంటలతో మేలు
అంతర పంటల సాగు రైతులకు అన్ని విధాలా మేలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. 8లో



పొలాల దారి కబ్జా
రామగిరి మండలంలో పొలాల కోసం ఏర్పాటు చేసిన దారిని టీడీపీ నేత ఒకరు దర్జాగా కబ్జా చేశారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.3°/22.7°

జిల్లా అంతటా శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పండుగ చేసుకోండి

పుట్టపర్తి టౌన్‌: త్యాగానికి ప్రతీకగా భావించే పవిత్రమైన బక్రీద్‌ పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లాలోని ముస్లింలకు ఆయన బక్రీద్‌ శుభాకాంక్షలు తెలియజేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు జంతుహింస చట్టాలను ఉల్లంఘించవద్దని తెలిపారు. మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఇప్పటికే పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌, పంచాయతీ రెవెన్యూ పశుసంవర్ధక, రవాణా శాఖల అధికారుల సమన్వయంతో జంతు వధ చట్టాలు ఉల్లంఘించకుండా ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ముఖ్యమైన ప్రాంతాల్లో చెక్‌ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విధంగా ముస్లిం మత పెద్దలు పోలీసులకు సహకరించాలని కోరారు. గోవులను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించే క్రమంలో తగిన పత్రాలు, ఆధారాలు చూపించాలన్నారు. శాంతిభద్రతలు, మత సంఘర్షణలు తలెత్తే పోస్టులు పెట్టొద్దని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అసాంఘిక, అనైతిక కార్యక్రమాలు జరిగితే డయల్‌ 100కు ఫోన్‌ చేయాలని సూచించారు.

అలరించిన 'సాయి ప్రేమ వాహిని'



సాయి ప్రేమవాహిని నాటికలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: సాయి సేవలో తరించిన అనుభవాలను కళ్లకు కడుతూ సాయి యూత్‌ 'సాయి ప్రేమ వాహిని' పేరుతో నిర్వహించిన నాటిక భక్తులను ఆలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి భక్తులు ఆదివారం సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహా సమాధి చెంత నాటిక ప్రదర్శించారు. తమ ప్రాంతంలో నిర్వహించిన సత్యసాయి బోధనలు, సేవా కార్యక్రమాలు, అనుభూతుల సమాహారాన్ని నాటికలో కళ్లకు కట్టినట్టు చూపారు. సత్యసాయి తన స్వహస్తాలతో రాసిన రామకథ రసవాహినిని అనుసరిస్తూ మధ్యప్రదేశ్‌ బాలవికాస్‌ చిన్నారులు సాయంత్రం 'శ్రీ రామ ఆగమన్‌' పేరుతో నిర్వహించిన నృత్య రూపకం భక్తులను మైమరపించింది.



'శ్రీ రామ్‌ గమన్‌' నృత్య రూపకం ప్రదర్శిస్తున్న బాల వికాస్‌ చిన్నారులు

కమనీయం.. ఖాద్రీశుని కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు

కదిరి టౌన్‌: శ్రీదేవి భూదేవి సమేత శ్రీఖాద్రీశుని కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. కదిరి నరసింహస్వామి ఆలయంలోని కల్యాణమండపంలో ఆదివారం అర్చకులు సంతోష్‌కుమార్‌ స్వామివారిని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలకంరించి, పూజలు చేశారు. హోమాలు చేసి, సంప్రదాయ బద్ధంగా శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణల మధ్య మేళాతాళలతో అంగరంగ వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాయాజాలం

పెట్రోల్‌ బంకుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. కొలతల్లో మాయాజాలం ప్రదర్శిస్తూ కోత పెట్టడమే కాకుండా ఇంధన కల్తీకి పాల్పడుతూ దగా చేస్తున్నారు. వాహనాలు తరచుగా మరమ్మతులకు గురవడంతో వాహనదారుల జేబులకు చిల్లు పడుతోంది.

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న పెట్రోలు బంకుల నిర్వాహకులు
- మీటర్‌ రీడింగ్‌ జంపింగ్‌తో తప్పుడు కొలతలు
- పలు బంకుల్లో ఇంధనం కల్తీ
- ఫిర్యాదులు వస్తే తప్ప స్పందించని అధికారులు
- 'మామూళ్ల మత్తు'లో నామమాత్రపు తనిఖీలు
- నిలువునా మోసపోతున్న వినియోగదారులు



సాక్షి, పుట్టపర్తి: పెట్రోలు బంకుల్లో యథేచ్ఛగా మోసాలు జరుగుతున్నాయి. కొలతల్లో అక్రమాలకు పాల్పడుతూ వినియోగదారుల జేబులకు చిల్లు పెడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వివిధ కంపెనీలకు చెందిన 119 పెట్రోల్‌ బంకులు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు లక్షలాది లీటర్ల పెట్రోల్‌, డీజిల్‌ అమ్మకాలు సాగుతున్నాయి. తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడటంలో పలు పెట్రోల్‌ బంకుల యజమానులు దోపిడీకి తెగబడినట్లు తెలుస్తోంది. ప్రధానంగా మీటర్‌ రీడింగ్‌ జంపింగ్‌తో నిర్దేశిత కొలతలో కోత పెడుతున్నారు. లీటర్‌ పెట్రోల్‌ లేదా డీజిల్‌కు 50 నుంచి 100 ఎంఎల్‌ మేర తక్కువగా వస్తున్నట్లు సమాచారం.

ఫిర్యాదులు వస్తేనే స్పందన

పెట్రోల్‌ బంకుల్లో మోసాలు వెలుగు చూస్తున్నా తూనికలు, కొలతలు, పౌరసరఫరాల శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ఫిర్యాదు వస్తేనే స్పందిస్తున్నారు తప్ప.. నిరంతర తనిఖీలు చేపట్టడం లేదు. వినియోగదారుల్లో సైతం చైతన్యం కొరవడటంతో ఏదైనా సంఘటన జరిగితే గొడవకు దిగడం తప్ప ఫిర్యాదు చేయడం లేదు. మూడు నెలలుగా జిల్లాలో తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. దీనికి తోడు అడపాదడపా వచ్చి 'మామూళ్లు' తీసుకుని వెళ్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఎక్కువ మొత్తంలో పోయించుకుంటే..

వేగంగా ట్యాంక్‌ నింపుతున్న క్రమంలో సిబ్బంది కొలత కనిపించకుండా ఏదైనా అడ్డు పెట్టి ఒక్కసారిగా పంపు బంద్‌ చేస్తూ మోసం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఎవరైనా ఎక్కువ మొత్తంలో ఇంధనం పోయించుకున్న క్రమంలో ముందు వాహనానికి పోసిన తర్వాత మీటర్‌పై ఉన్న రీడింగ్‌ నుంచే పోస్తూ దగా చేస్తున్నట్లు వాహనదారులు వాపోతున్నారు.

జిల్లాలో పెట్రోల్ బంకుల వివరాలు		
	ఇండియన్‌ ఆయిల్‌	65
	హెచ్‌పీ	33
	భారత్‌ పెట్రోలియం	21

డిజిటల్‌ మీటర్లలో అక్రమాలు!

ప్రతి పెట్రోల్‌ బంకులోని డిజిటల్‌ మీటర్లలో అవకతవకలు ఉన్నట్లు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్‌, డీజిల్‌ పోయించుకునేందుకు బంక్‌ వద్దకు వెళ్లినప్పుడు లీటరుకు రెండు నుంచి మూడు పాయింట్ల వద్దే మీటరు నిలిపేస్తున్నారు. ఇలా చిల్లర పేరిట నెలకు రూ.లక్షల్లో వినియోగదారులు నష్టపోతున్నారని చెప్పవచ్చు. డిజిటల్‌ మీటర్లలోనూ అక్రమాలు చోటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది. సాఫ్ట్‌వేర్‌లో మార్పుల కారణంగా రూ.100, రూ.200 చొప్పున కొనుగోలు చేస్తే రూ.3 నుంచి రూ.5 నష్టపోతున్నారు.

మోసాల్లో మచ్చుకు కొన్ని..

- ధర్మవరానికి చెందిన జగన్‌మోహన్‌ ఓ ప్రభుత్వ వాహనానికి డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఇటీవల బెంగళూరు రోడ్డులోని ఓ పెట్రోల బంకులో రూ.500 విలువ చేసే పెట్రోల్‌ పోయించుకున్నాడు. కనీసం రూ.200 విలువ గల పెట్రోల్‌ కూడా రాలేదని పేర్కొన్నాడు. వాహనం మధ్యలోనే ఆగిపోవడంతో ఇబ్బంది పడినట్లు చెప్పాడు. తర్వాత పెట్రోల్‌ బంకు వద్దకు వెళ్లి అడగ్గా.. అప్పుడే సరి చూసుకోవాలని బదులిచ్చాడు.
- హిందూపురానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల తన కారులో మడకశిరకు వెళ్లి.. పక్కనే కర్ణాటక సరిహద్దులో ఉన్న ఓ పెట్రోల్‌ బంకులో రూ.వెయ్యి చెల్లించి పెట్రోల్‌ వేయించుకున్నాడు. అయితే అక్కడి నుంచి పెనుకొండకు కూడా రాకముందే పెట్రోల్‌ లేని కారణంగా వాహనం ఆగిపోయింది. ఫోన్‌ ద్వారా సదరు పెట్రోల్‌ బంకు యజమానిని అడగ్గా.. అక్కడే సరి చూసుకోవాలని సమాధానం చెప్పాడు.
- హిందూపురంలోని పశువుల ఆస్పత్రికి ఎదురుగా ఉన్న పెట్రోల్‌ బంకులో తక్కువ పెట్రోల్‌ ఇస్తున్నారని రహమత్‌పురానికి చెందిన ఓ మల్బరీ రీలర్‌ ఆరు నెలల క్రితం గొడవకు దిగిన ఘటన అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌ అయింది. మొత్తం రూ.230 విలువ చేసే పెట్రోల్‌ పోయించుకుంటే రూ.120 పెట్రోల్‌ మాత్రమే బాటిల్‌లోకి వచ్చిందని అధికారులకు ఫిర్యాదు చేశాడు. నెల రోజుల వ్యవధిలో నాలుగుసార్లు మోసపోయినట్లు బాధితుడు వాపోయాడు.
- పెనుకొండలో కోటకు వెళ్లే దారిలో ఉన్న బంకులో ఓ వ్యక్తి తన కారుకు రూ.2వేలు పెట్రోల్‌ వేయించాడు. అయితే అక్కడి నుంచి అనంతపురం వెళ్తుండగా మార్గం మధ్యలోనే కారు ఆగిపోయింది. సమీపంలోనే ధర్మవరంలో ఉన్న ఓ గ్యారేజ్‌ దగ్గరకు వెళ్లి కారును చూపించాడు. కల్తీ ఇంధనం కారణంగా ఇంజిన్‌ దెబ్బ తిన్నదని మెకానిక్‌ తెలిపాడు. అనంతరం అదే బంకు వద్దకు వెళ్లి వినియోగదారుడు గొడవ చేయగా.. అక్కడ సిబ్బంది కూడా రుబాబు చేశారు.

తనిఖీలు చేపడతాం

నేను విధుల్లో చేరినప్పటి నుంచి ఎలాంటి ఫిర్యాదులూ రాలేదు. నిబంధనలు పాటించని.. తప్పుడు కొలతలు, కల్తీకి పాల్పడినట్లు మా దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తూనికలు, కొలతల సిబ్బంది, డీటీ, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపడతాం. మేం తనిఖీలకు వచ్చినప్పుడు ఫిర్యాదుదారులు కూడా వచ్చి సాక్ష్యం చెబితే బాగుంటుంది. ఫిర్యాదు ఇచ్చిన వారు మాతో పాటే వస్తే తనిఖీ చేయడం సులువు అవుతుంది.

– సుధాకర్‌,
లీగల్‌ మెట్రాలజీ అసిస్టెంట్‌ కంట్రోలర్‌

వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండల కేంద్రం గోరంట్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, వానవోలు ఉపసర్పంచ్‌ బుల్లెట్‌ బాబు ఇంటిపై ఆదివారం తెల్లవారుజామున రాళ్లతో దాడి చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బుల్లెట్‌ బాబు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరఫున క్రియాశీలకంగా పనిచేశారు. శనివారం రాత్రి బాబు కుటుంబ సభ్యులు భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. ఆదివారం తెల్లవారుజామున 5.40 గంటల సమయంలో ఇంటిపైకి రాళ్లు పడ్డాయి. కాసేపటి తర్వాత కుటుంబ సభ్యులు బయటకు రాగా.. కాంపౌండ్‌లోకి విచ్చలవిడిగా కంకర రాళ్లు కనిపించాయి. తమను భయభ్రాంతులకు గురిచేయడానికే ఇలా చేశారని బాధితుడు చెబుతున్నారు. తెలుగుదేశం, జనసేన పార్టీ నేతలే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

దాడి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆదివారం సాయంత్రం గోరంట్ల చేరుకుని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు బుల్లెట్‌ బాబును పరామర్శించి, ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్‌గా చేసుకుని టీడీపీ–జనసేన నాయకులు దాడులకు తెగబడుతూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. దాడులు ఆపి.. పాలనపై దృష్టి సారించాలని అధికార పార్టీ నేతలకు హితవు పలికారు. దాడులు చేస్తూ పోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సేవకు వినియోగించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కళ్లగేర శంకరరెడ్డి, గోరంట్ల ఉప సర్పంచ్‌ రాజారెడ్డి, సమరసింహారెడ్డి, నరసింహామూర్తి, ఆనంద్‌, రమణ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్‌

- నేడు ఘనంగా ఈద్‌–ఉల్‌–అద్హా నిర్వహణకు ఏర్పాట్లు
- ఈద్గాలో సామూహిక ప్రార్థనలు చేయనున్న ముస్లింలు
- సర్వమానవాళి కోసం దువా చేయనున్న మతపెద్దలు



హిందూపురంలోని ఆల్‌ హిలాల్‌ ఈద్గా మైదానంలో నమాజ్‌ కోసం ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

కదిరి/పుట్టపర్తి టౌన్‌: ముస్లింల ప్రధాన పండుగలు రెండు. ఒకటి రంజాన్‌, మరొకటి బక్రీద్‌. బక్రీద్‌లో బకర్‌ అంటే మూగజీవి. ఈద్‌ అంటే పండుగ. త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు. ఈద్‌–ఉల్‌–జుహ అని కూడా ఈ పండుగను పిలుస్తారు. దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సోమవారం ముస్లింలు ఈ పండుగను జరుపుకోనున్నారు. ఇందుకోసం జిల్లాలోని అన్ని ఈద్గాలతో పాటు మసీదులలో సామూహిక ప్రార్థనలు జరుపుకునేందుకు మతపెద్దలు, ముస్లింలతో పాటు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అల్లా ఆజ్ఞను తూచ తప్పకుండా పాటించడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం.

కన్న కొడుకునే బలి ఇచ్చేందుకు సిద్ధం

ఇస్లాం మత ప్రథమ అధ్యాయ ప్రారంభకులైన హజరత్‌ ఇబ్రహీం దంపతులకు కొన్నేళ్లపాటు పిల్లలు లేరు. దైవానుగ్రహంతో తనకు 80 ఏళ్ల వయసులో జన్మించిన ఏకైక పుత్రుడికి ఇస్మాయిల్‌ అనే పేరు పెట్టారు. ఓరోజు తన కన్నకొడుకును బలి ఇస్తున్నట్లు ఇబ్రహీం కలగన్నాడు. నిజానికి అది కల కాదు. దైవాదేశ పాలనలో ప్రేమానురాగాలకు తావులేదని చాటిచెప్పేందుకు ఎదురైన విషమ పరీక్ష. తన కుమారుడికి ఈ విషయం చెబితే ఇందుకు కుమారుడు తనను బలి తీసుకోవచ్చు అంటూ సంతోషంగా ముందుకొచ్చాడు. 'దైవాదేశాన్ని వెంటనే అమలు పరచండి' అన్నాడు. కొడుకును బలి ఇచ్చేందుకు ఇబ్రహీం సిద్ధమయ్యాడు. అక్కడున్న వారంతా ఆశ్చర్యపోతారు. అప్పుడు చుట్టూ నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. 'నా ప్రియ ప్రవక్తా.. ఇబ్రహీం!. నీ త్యాగాన్ని నేను మెచ్చుకుంటున్నాను. నీకు ఎంతో ఇష్టమైన కన్నకొడుకునే బలి ఇచ్చేందుకు ముందుకొచ్చావు. నా పరీక్షలో మీరు అత్యున్నత శ్రేణిలో నెగ్గారు. నీ కొడుకు బదులు ఈ జంతువును బలి ఇవ్వండి' అన్న దైవవాణి విన్పించింది. వెంటనే అక్కడ మూగజీవం ప్రత్యక్షమైంది. అప్పుడు దాన్ని బలి ఇస్తారు. అందుకే త్యాగానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు.

ఖుర్బానీ ఇవ్వడం ఆచారం

ఖుర్బానీ అంటే పేదలకు మాంసాన్ని దానం ఇవ్వడం, త్యాగం అనే అర్థాలు ఉన్నాయి. సాన్నిధ్యం, సామీప్యం, సమర్పణ అని కూడా అర్థం. అంటే దైవసాన్నిధ్యాన్ని పొందడం, దైవానికి సమర్పించడం, దైవం కోసం త్యాగం చేయడం అని భావిస్తారు. ప్రాణ త్యాగానికైనా వెనుకాడనని చాటిచెప్పేందుకు నిదర్శనమే ఈ ఖుర్బానీ. బక్రీదుకు బలి ఇచ్చిన నెమరు వేసే మూగజీవి మాంసాన్ని మూడు భాగాలు చేసి అందులో ఒక భాగం పేదలకు పంచి పెడతారు. ఇంకో భాగం బంధువులకు, మిగిలిన మూడో భాగం కుటుంబ సభ్యుల కోసం వాడుకుంటారు.

తప్పక వెళ్లాల్సిన హజ్‌యాత్ర

ఇస్లాం మత గ్రంథం ఖురాన్‌–ఎ–షరీఫ్‌లో 'ఇమాన్‌, ఇహాన్‌, ఇబాదత్‌ మూలసిద్ధాంతాలు. భగవంతుడు ఒక్కడే అని ఇమాన్‌ చెబుతుంది. మానవులు పాటించాల్సిన నైతిక విలువలు ఇహాన్‌కు సంబంధించినవి. ఇబాదత్‌లో ప్రతి ముస్లిం తప్పకుండా అనుసరించాల్సిన ఐదు నియమాలు ఉన్నాయి. అల్లాహ్‌ను విశ్వసించడం, 5 పర్యాయాలు నమాజ్‌, జీవితంలో ఒక్కసారైనా మక్కా సందర్శన. వీటిలో చివరి నియమాన్ని పాటించే నేపథ్యంలో జరుపుకునే పండుగే బక్రీద్‌.

త్యాగాల పండుగ బక్రీద్‌



బక్రీద్‌ పండుగ మనిషికి దైవ భీతిని, త్యాగ నిరతిని తెలియజేస్తుంది. అందుకే ఈ పండుగను త్యాగాల పండుగ అంటారు. చనిపోయిన కుటుంబ సభ్యులను గుర్తు చేసుకొని వారి పేరున పొట్టేలు మాంసాన్ని ఖుర్బానీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో ఉంటూ సన్మార్గంలో నడవాలని బక్రీద్‌ పండుగ తెలియజేస్తుంది.

–కోలా అమీర్‌బాషా,
రైస్‌ మర్చంట్‌, కదిరి

మహోన్నత త్యాగానికి ప్రతీక



ఇబ్రహీం గొప్ప ప్రవక్తల్లో ఒకరు. ఆయనకు 'ఖలీలుల్లాహ్‌' అనే బిరుదు ఉంది. అంటే 'అల్లాహ్‌ మిత్రుడు' అని అర్థం. దైవ ప్రసన్నం కోసం చేసే కార్యాన్ని మించింది లేదని తన జీవితం ద్వారా ఆయన నిరూపించారు. కలలో ఏదైనా కన్పిస్తే అది ఆ దేవుని ఆజ్ఞ అని ఆయన భావించి వెంటనే ఆచరించారు. ఇబ్రహీంతో పాటు ఆయన కుమారుడు ఇస్మాయిల్‌ల మహోన్నత త్యాగనిరతిని స్మరించుకోవడం కోసం ఈ బక్రీదు పండుగను జరుపుకుంటాం. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో ఒక్కసారైనా హజ్‌యాత్ర చేసి ముక్తిని పొందాలి.

–సయ్యద్‌ ఉబేదుల్లా హుసేని,
హజరత్‌ సయ్యద్‌ జహీరుద్దీన్‌ బాబా దర్గా పీఠాధిపతి, కుటాగుళ్ల, కదిరి

ప్రవక్తలను ఆదర్శంగా తీసుకోవాలి



ప్రవక్తల త్యాగానికి ప్రతీక బక్రీద్‌. ఆనాడు వారు ఆచరిస్తే నేడు పండుగలా ముస్లింలు జరుపుకొంటున్నారు. ప్రవక్తల జీవితాలు, వారు అనుసరించిన విధానాలను తీసుకొని అనుసరించాలి. చెడుమార్గాలకు దూరంగా మంచి, శాంతి మార్గాల్లో నడవాలి. సేవా గుణం కలిగి ఉండాలి. పండుగ తరువాత కూడా ఇదే స్ఫూర్తితో మెలగాలి.

– జాకిర్‌ ముక్తాసాబ్‌, ముత్తవల్లి,
పుట్టపర్తి

మితిమీరితే ముప్పే



- భారీగా పెరిగిన యాంటీ బయాటిక్స్‌ వాడకం
- అవసరం లేకున్నా వాడితే దుష్ఫలితాలు తప్పవు

ప్రశాంతి నిలయం: జలుబు, దగ్గు, జ్వరం తదితర ఏ చిన్న జబ్బు చేసినా వెంటనే తగ్గిపోవాలని చాలామంది యాంటీ బయాటిక్స్‌ వాడుతున్నారు. డాక్టరును సంప్రదించకుండా నేరుగా మందుల షాపుకెళ్లి యాంటీ బయాటిక్స్‌తో కూడిన మందులు తెచ్చుకుంటున్నారు. అవసరం లేకున్నా యాంటీబయాటిక్స్‌ వాడితో ఆరోగ్యానికి ముప్పు తప్పదని వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 900 పైచిలుకు హోల్‌సేల్‌, రిటైల్‌ మందుల దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా కోటి రూపాయలకు పైగా విలువ చేసే యాంటీ బయాటిక్స్‌ మందుల విక్రయం జరుగుతోందని తెలుస్తోంది. ముఖ్యంగా అజిత్రోమైసిన్‌, సెఫాక్సిమ్‌, నార్‌ఫ్లాక్సిన్‌, సెఫ్ట్రియాక్సోన్‌, ఆఫ్లాక్సోసిన్‌, టాజోబ్యాక్లమ్‌, సిప్రాన్‌, సిప్రోఫ్లాక్సిన్‌ వంటి యాంటీబయాటిక్స్‌ ఎక్కువ మోతాదులో వినియోగిస్తున్నారు. డాక్టర్‌ సూచన మేరకే యాంటీబయాటిక్స్‌ విక్రయించాలని నిబంధన ఉన్నా మందుల దుకాణదారులు అవేమీ పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు దృష్టిసారించకపోవడంతో ప్రజలు ఎడాపెడా వాడేస్తూ ఆరోగ్య సమస్యలను కొని తెచ్చుకుంటున్నారని నిపుణులు అంటున్నారు.

అతిగా వాడితే కలిగే దుష్ప్రభావాలివీ..

యాంటీబయాటిక్‌ మందులను రోగులు ఎక్కువ మోతాదులో వాడడం వల్ల కిడ్నీ, కాలేయం, చర్మ సంబంధిత వ్యాధులబారిన పడుతున్నారు. యాంటీబయాటిక్స్‌ ఎడాపెడా వాడడం వల్ల మన శరీరం సహజసిద్ధంగా ఉండే వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతుంది. రోగులకు వచ్చిన ఆరోగ్య సమస్య ఆధారంగా, తీవ్రతను బట్టి ఎంత మోతాదులో, ఏ రకమైన యాంటీబయాటిక్స్‌ ఎంత కాలం వాడాలి అన్నది వైద్యుల సూచన మేరకే పాటించాలి. సొంత వైద్యంతో తీవ్రమైన అనర్థాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది. మోతాదు తక్కువ తీసుకుంటే రోగ కారక బ్యాక్టీరియా క్రమక్రమంగా మందులకు లొంగకుండా తమ నిరోధక శక్తిని పెంచుకునే అవకాశం ఉంటుంది. ఎక్కువ మోతాదులో వాడటం వల్ల కాలేయం, గుండె, కిడ్నీ, చర్మం వంటి శరీర భాగాలపై అధిక ప్రభావం చూపి తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

డాక్టర్‌ సూచనతోనే వాడాలి



రోగం వచ్చినప్పుడు వైద్యుల సూచనల మేరకే యాంటీబయాటిక్స్‌ మందులు వాడాలి. ఇష్టమొచ్చినట్టు వాడడం వల్ల కాలేయం, కిడ్నీ, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. సహజంగా లభించే రోగ నిరోధకశక్తి తగ్గిపోయే ప్రమాదం కూడా ఉంది. మందుల దుకాణాల్లో వైద్యుల సూచనలు లేకుండా యాంటీబయాటిక్స్‌ విక్రయిస్తున్నట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్‌ మంజువాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



బొమ్మనహాళ్‌: కర్ణాటకలోని హొస్పేట్‌ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఆదివారం ఉదయానికి జలాశయంలో 6.110 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,619 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. అవుట్‌ఫ్లో 577 క్యూసెక్కులుగా ఉంది. ప్రసుత్తం జలాశయంలో నీటి నిల్వ 1,633 అడుగులకు గాను 1583.03 అడుగులకు చేరుకుంది. డ్యాం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.110 టీఎంసీల నీరు ఉంది. డ్యాం ఎగువ భాగాల్లో వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గతేడాది ఇదే సమయానికి 1,580.94 అడుగుల వద్ద 4.940 టీఎంసీల నీరు నిల్వ ఉండేదని బోర్డు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్య


పవన్‌కుమార్ (ఫైల్)

కొత్తచెరువు: మానసిక ఒత్తిళ్లు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన మేరకు... కొత్తచెరువు గ్రామానికి చెందిన చంద్రప్పగారి పవన్ కుమార్ (29) ఇటీవల బీటెక్ పూర్తి చేసి రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరాడు. హైదరాబాద్‌లోనే తన స్నేహితులతో కలసి అద్దె ఇంట్లో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో ఒత్తిళ్లను తాళలేక మనస్తాపం చెందిన పవన్‌కుమార్ శనివారం రాత్రి గదిలో స్నేహితులు ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై తెలంగాణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, ఒక్కగానొక్క కుమారుడి మృతితో పవన్ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

గుండెపోటుతో సర్పంచ్ మృతి


రామచంద్రనాయుడు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: మండలంలోని అమగొండపాళ్యం సర్పంచ్ రామచంద్ర నాయుడు(53) తీవ్ర గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వీరాభిమాని అయిన రామచంద్ర ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలైనప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలోనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది శనివారం ఇంటికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు భార్య వసుంధర తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రెస్కో మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, మండల కన్వీనర్ నరసారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఈశ్వరయ్య, తిమ్మప్ప, గంగాద్రి, గ్రామస్తులు... రామచంద్రనాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైలు కింద పడి మహిళ మృతి

రాప్తాడు: మండలంలోని ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఓ మహిళ మృతి చెందింది. మృతురాలిని అనంతపురం రూరల్ మండలం ఆలమూరు గ్రామానికి చెందిన నాగరత్నమ్మ (55)గా గుర్తించినట్లు ధర్మవరం రైల్వే ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. కాగా, పాఠశాలల వద్ద పండ్లు అమ్ముకుని జీవనం సాగించే నాగరత్నమ్మ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

అంతర పంటలు అన్నివిధాలా మేలు

- వాలుకు అడ్డంగా దుక్కి విత్తుకుంటే తేమశాతం పెరుగుదల
- విత్తనశుద్ధి, మొక్కల సాంద్రత, కలుపు నివారణతోనే లాభసాటి
- తెగుళ్ల నివారణకు వేరుశనగ, పత్తి చుట్టూ రక్షణ పంటలు వేయాలి
- ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, జి.నారాయణస్వామి వెల్లడి



డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ జి.నారాయణస్వామి


వేరుశనగ


ఆముదం

అనంతపురం అగ్రికల్చర్: వర్షాధారంగా కేవలం ఒకట్రెండు పంటలను నమ్ముకోకుండా మధ్యమధ్యలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలకు చెందిన అంతర పంటలు వేసుకోవడం వల్ల మెట్ట వ్యవసాయం లాభసాటి అవుతుందని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. విస్తారంగా వర్షాలు నమోదైన నేపథ్యంలో ఖరీఫ్ పంటలు విత్తుకునేందుకు ఇదే సరైన సమయమని చెబుతున్నారు. వివరాలు వారి మాటల్లోనే..

- తేలికపాటి నేలల్లో వాలుకు అడ్డంగా దుక్కి చేసుకుని తర్వాత పంటలు విత్తుకుంటే నేలతో తేమశాతం ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది. వర్షాధారంగా అంతర పంటలు తప్పనిసరిగా వేయాలి. ఆరుతడి పంటలకు బోదే లేదా సాళ్లు లేదా ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవాలి. ఒకవేళ ఎక్కువ వర్షాలు వచ్చినా నీటిని బయటకు పంపడానికి అవకాశం ఉంటుంది. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికట్టడానికి వరి, వేరుశనగ, మొక్కజొన్న, జొన్న, కంది, పెసర విత్తనాలను తెగుళ్ల మందుతో విత్తనశుద్ధి (సీడ్ ట్రీట్‌మెంట్) చేసుకోవాలి. పొలం గట్లపై కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మరీ దగ్గరదగ్గరగా ఒత్తుగా లేకుండా ప్రతి పంటలోనూ మొక్కల సాంద్రత పాటించాలి.
- వేరుశనగ సాగు చేసే రైతులు పొలాన్ని రెండు మూడు సార్లు దుక్కి చేసుకోవాలి. జూలై మాసం అంతా విత్తుకునేందుకు అనుకూలం. కే-6, కే-9, కదిరి హరితాంధ్ర, అనంత, ధరణి, కదిరి-లేపాక్షి, టీసీజీఎస్-1694 లాంటి విత్తన రకాలు అనువుగా ఉంటాయి. ఎకరాకు 50 నుంచి 60 కిలోలు విత్తనం అవసరం. విత్తే ముందు కిలో విత్తనానికి 1 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేసిన తర్వాత ఒక గ్రాము టెబుకొనజోల్ అలాగే 10 గ్రాము ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి పాటించాలి. వేరుశనగ పొలం చుట్టూ రక్షణ పంటలుగా సజ్జ, జొన్న నాలుగు నుంచి ఆరు వరసలు విత్తుకుంటే కాండం కుళ్లు, వైరస్ తెగుళ్లను వ్యాప్తి చేసే రసంపీల్చు పురుగులు, తామర పురుగులను నివారించవచ్చు. 7 : 1 లేదా 11 : 1 లేదా 15 : 1 నిష్పత్తిలో వేరుశనగలో కంది లేదా సజ్జ పంటలు వేసుకోవాలి. విత్తే సమయం లేదా విత్తిన తర్వాత 20 నుంచి 30 రోజుల సమయంలో నీటి సంరక్షణ కోసం ప్రతి 3.6 మీటర్లకు ఒక తల్లిచాలు ఏర్పాటు చేసుకోవాలి.
- కంది సాగు చేసే రైతులు తేలికపాటి నేలల్లో మధ్యస్థ రకాలైన పీఆర్‌జీ-176, పీఆర్‌జీ-158, ఐసీపీఎల్-84031 విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. బరువు నేలల్లో ఎక్కువ కాలపరిమితి రకాలైన ఎల్‌ఆర్‌జీ-41, ఎల్‌ఆర్‌జీ-52, , ఎల్‌ఆర్‌జీ-105, టీఆర్‌జీ-59, ఐసీపీఎల్-85063, ఐసీపీఎల్-87119, బీఎస్ఎంఆర్ -786 రకాలు ఎంపిక చేసుకోవాలి.
- పత్తి విషయానికి వస్తే... ఎర్రనేలల్లో జూన్ నుంచి జూలై 15 వరకు విత్తుకోవచ్చు. నల్లరేగడి భూముల్లో జూలై నుంచి ఆగస్టు 15 వరకు విత్తుకునేందుకు అనుకూలం. ఒక ప్రాంతంలో ఉన్న రైతులంతా దఫాలుగా కాకుండా వీలైతే స్వల్ప వ్యవధిలో ఒకేసారి విత్తుకుంటే తెగుళ్ల, చీడపీడల నివారణకు సులభమవుతుంది. బీటీ రకం విత్తనాలు ఎకరాకు 750 గ్రాములు నుంచి ఒక కిలో అవసరం. బీటీ రకం వేసుకుంటే పొలం చుట్టూ నాన్ బీటీ పత్తి లేదా కంది వేసుకుంటే కాయతొలచు పురుగు ఉధృతిని అరికట్టవచ్చు. విత్తుకున్న 40 రోజులకు తప్పనిసరిగా ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. ముందుగా వేసుకున్న ప్రాంతాల్లో పత్తి పంట ప్రస్తుతం మొలకదశలో ఉంది. ఈ వాతావరణానికి వేరుకుళ్లు తెగులు సోకే అవకాశం ఉన్నందున 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటికి కలిపి మొక్క వేరుమండలం తడిచేలా పోయాలి. ఈ సమస్య నివారణకు విత్తే సమయంలో కిలో విత్తనానికి 10 గ్రాములు ట్రైకోడెర్మావిరిడీతో విత్తనశుద్ధి చేసుకోవాలి.
- ఆముదం పంట విత్తుకునేందుకు జూన్ 15 నుంచి జూలై 31 వరకు అనుకూలం. హరిత, కిరణ్, జ్వాల, ప్రగతి లాంటి సూటి రకాలు అలాగే డీసీహెచ్-117, పీసీహెచ్-111, జీసీహెచ్-8, ఐసీహెచ్-66, ఐసీహెచ్-5 లాంటి హైబ్రీడ్ విత్తన రకాలు అనువుగా ఉంటాయి.
- వరి నారు మడులు పెంచుకునేందుకు జూన్ 15 నుంచి జూన్ 30 వరకు అనుకూలం. సాంబమసూరి, నంద్యాల సన్నాలు, నెల్లూరు సోనా, నెల్లూరి మసూరి, నంద్యాల సోనా, ఎంటీయూ-1212, ఎంటీయూ-1280, ఎంటీయూ-1281 లాంటి రకాలు బాగుంటాయి. విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ల నివారణకు నారుపోసే ముందు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేసుకోవాలి.

ప్రమాదంలో యువకుడి మృతి

పెనుకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తమిళనాడుకు చెందిన ధనుంజయ (34) కియా అనుబంధ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 11 గంటలకు విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వెళుతూ తిమ్మాపురం సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే పాత బీఎస్ఎన్ఎల్ గదిని ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ధనుంజయను అటుగా వెళుతున్న గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం తెల్లవారుజామున ఆయన మృతి చెందాడు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌హెచ్‌ఓ రమేష్ తెలిపారు.

లారీ డ్రైవర్ దుర్మరణం


నుజ్జునుజ్జయిన లారీ

చెన్నేకొత్తపల్లి: ఆగి ఉన్న లారీని వెనుక ఉంచి ఢీకొన్న ఘటనలో మరో లారీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... చెన్నేకొత్తపల్లి సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ధాబా వద్ద శనివారం అర్ధరాత్రి ఓ లారీని ఆపి డ్రైవర్, క్లీనర్ టీ తాగేందుకు వెళ్లారు. అదే సమయంలో బెంగళూరు నుంచి అనంతపురం వైపుగా వేగంగా వెళుతున్న మరో లారీ ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఘటనలో ఢీకొన్న లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. లారీని నడుపుతున్న తమిళనాడులోని సేలం జిల్లాకు చెందిన డ్రైవర్ శంకర్ (40) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని లారీలో ఇరుక్కున్న శంకర్ మృతదేహాన్ని జేసీబీ సాయంతో వెలికి తీశారు. మృతుని తమ్ముడు వడివేలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మామిడిలో యాజమాన్యం చేపట్టండి


మామిడిలో కత్తిరింపులు చేస్తున్న దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడిలో కాయ కోతలు దాదాపు పూర్తయినట్లు రెండు జిల్లాల ఉద్యానశాఖ డీడీలు జి.చంద్రశేఖర్, జి.ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. కోతల తర్వాత చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపైనే వచ్చే ఏడాది పంట దిగుబడులు ఆధారపడి ఉంటాయన్నారు. ఈ క్రమంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులను వివరించారు.

- తోటలో మామిడి కాయలు పూర్తిగా కోసిన తర్వాత ఒకసారి నీటి తడి ఇవ్వాలి.
- ఎండుపుల్లలు, పూతకాడలు, ఆకుగూళ్లు లాంటివి ఏరివేయాలి.
- చెట్ల మధ్య భాగంలో చిన్నపాటి కొమ్మలు తొలగించి సూర్యరశ్మి బాగా ప్రసరించేలా చేయాలి.
- బాగా ముదిరిన చెట్లలో అధికంగా పెరిగిన కొమ్మలను రంపం లేదా పవర్‌సాతో కత్తిరించాలి.
- చెట్ల ఎత్తును బాగా తగ్గించాలి.
- తొలగించిన కొమ్మల చివర కాపర్ సంబంధిత శిలీంద్రనాశిని లేదా బావిస్టన్‌ను పూయాలి.
- తొలకరి సమయంలో చెట్ల మొదళ్ల వద్ద భూమిని దున్నాలి. లేకుంటే పాదులను తవ్వి తిరగేయాలి.
- జూన్, జూలైలో ఎకారకు 10 కిలోల జీలుగ లేదా 25 కిలోల జనుము లాంటి పచ్చిరొట్ట విత్తనాలు చల్లి 45 నుంచి 50 రోజుల తర్వాత బాగా కలియదున్నితే భూసారం పెరుగుతుంది.
- ప్రతి చెట్టు పాదులో 100 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు లేదా 10 కిలోల వర్మీ కంపోస్టు వేయాలి.
- సిఫారసు చేసిన మోతాదులో ఒక్కో చెట్టుకు 1.7 కిలోల యూరియా, 1.1 కిలోల సింగిల్‌సూపర్‌ఫాస్ఫేట్, 1.15 కిలోల పొటాషియం సల్ఫేట్ వేయాలి.
- జూన్-జూలై అలాగే అక్టోబర్-నవంబర్‌లో సంవత్సరానికి రెండు సార్లు పైన తెలిపిన విధంగా రసాయన ఎరువులు వేయాలి.
- కొత్త చిగుర్లు వచ్చే సమయంలో ఒక్కో చెట్టుకు 5 గ్రాముల జింక్‌సల్ఫేట్, 2 గ్రాముల బోరాక్స్, 10 గ్రాముల యూరియా ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పిందె కట్టడానికి వీలుగా పూత వచ్చే ముందు మొదటి దశలో పిచికారీ చేసే మందులలో 2 గ్రాముల బోరాక్స్ (సొల్యూబార్) లీటర్ నీటికి కలుపుకుంటే ఫలితాలు బాగుంటాయి.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి బలవన్మరణం

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. అనారోగ్యాన్ని తాళలేక ఇద్దరు, కుటుంబసభ్యులు తన బాగోగులు చూడడం లేదన్న బాధతో మరొకరు ఆత్మహత్య చేసుకున్నారు.

సోమందేపల్లి: మండలంలోని ఓబుళదేవరపల్లి గ్రామానికి చెందిన లక్ష్మయ్య(80) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలం క్రితం భార్య మృతి చెందింది. అప్పటి నుంచి ఒంటరిగా ఉన్న లక్ష్మయ్య... తనకున్న ముగ్గురు కుమారులు బాగోగులు పట్టించుకోకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ క్రమంలోనే ఆదివారం ఇంట్లోనే పైకప్పుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్‌ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎన్‌పీకుంట: మండలంలోని పెడబల్లి గ్రామానికి చెందిన వివాహిత మల్లిక (28) ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తాళలేక ఊయల వేసిన చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫాతిమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. కాగా మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు.

పెనుకొండ: స్థానిక రైల్వే రోడ్డు మార్గంలో నివాసముంటున్న చాకలి శివయ్య (66) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా ఆయన క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న ఉదయం 10 గంటలకు ఇంట్లోనున్న కత్తి తీసుకుని రైల్వే బ్రిడ్జి కిందకు చేరుకుని గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం దుర్వాసన రావడంతో పాటు స్థానికులు అటుగా వెళ్లి చూశారు. కుళ్లిన మృతదేహాన్ని కుక్కలు పీక్కు తిన్నాయి. సమాచారం అందుకున్న ఎస్‌హెచ్‌ఓ దాదాపీర్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఆవేదనతో ఆగిన గుండె

- ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన టీఎన్ దీపిక


అనాథలుగా మారిన ఉమేష్ కుటుంబం


ఉమేష్ భార్యను పరామర్శిస్తున్న టీఎన్ దీపిక

హిందూపురం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమిని తట్టుకోలేక అన్నాహారాలు మాని అనారోగ్యానికి గురైన చలివెందుల గ్రామానికి చెందిన ఉమేష్ (36) మృతిచెందాడు. ఆలస్యంగా వెలుగుచూసిన ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు... ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఉమేష్ తీవ్రంగా కుమిలిపోతూ ఆహారం తినక అనారోగ్యం పాలయ్యాడు. ఈ క్రమంలోనే తనకు తారసపడిన గ్రామస్తులతో సక్రమంగా మాట్లాడేవాడు కాదు. రెండు రోజుల క్రితం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆదివారం మృతుడి భార్య వాణి, ఆరేళ్ల వయసున్న కుమారుడు వరుణ్, నాలుగేళ్ల వయసున్న కుమార్తె పూజను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కాగా, ఉమేష్ మృతిపై గ్రామ సర్పంచ్ ఉపేంద్రరెడ్డి సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి


విద్యార్థినికి పురస్కారం అందజేస్తున్న డీఈఓ మీనాక్షి, మాజీ మంత్రి పల్లె

హిందూపురం టౌన్: నూతన సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు డీఈఓ మీనాక్షి సూచించారు. స్థానిక సప్తగిరి డిగ్రీ కళాశాల వేదికగా హిందూపురం డివిజన్ భగీరథ ఎడ్యుకేషనల్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఉప్పర (సగర) విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా సాగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డీఈఓ మీనాక్షి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యకు మించిన సంపద ఏదీ లేదన్నారు. నూతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఆదినారాయణ, అనంతపురం శారద, మాజీ జెడ్పీటీసీ వెంకటరమణ, సప్తగిరి కళాశాల మాజీ సీఈఓ ఈశ్వరరెడ్డి, మహంతేష్, రాజశేఖర్, కార్యదర్శి ఎల్ఐసీ వెంకటేశులు, ట్రెజరర్ రామాంజినేయులు, కిష్టప్ప, నాగప్ప, జాయింట్ సెక్రటరీ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరానికి చేరుకున్న సైనికుల బైక్ ర్యాలీ


ధర్మవరానికి చేరుకున్న భారత సైనికుల బైకు ర్యాలీ

ధర్మవరం అర్బన్: కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికుల సేవలను స్మరించుకునేలా ఆర్మీ జవానులు చేపట్టిన బైక్ ర్యాలీ ఆదివారం ధర్మవరం మండలం రేగాటిపల్లికి చేరుకుంది.ఇండియన్ ఆర్మీ సౌత్ డెల్టా ఫైర్ ఎక్స్‌పిడిషన్ కెప్టెన్ ఆదర్శ్‌జమేధ, మనోజ్‌నాయక్ నేతృత్వంలో బ్రిగేడియర్ అజయ్‌కుమార్ ఠాకూర్ సారథ్యంలో తమిళనాడులోని ధనుష్‌కోటి నుంచి ర్యాలీ చేపట్టినట్లుగా సైనికులు తెలిపారు. కార్గిల్ యుద్ధం ముగిసి నేటికి పాతికేళ్లు అయిందని, ఈ నేపథ్యంలో కార్గిల్ అమరుల త్యాగాలను స్మరించుకునేలా లద్ధాఖ్ వరకూ 5వేల కిలోమీటర్లు మేర బైక్ ర్యాలీ కొనసాగుతుందన్నారు. వచ్చే నెల 9న కార్గిల్ యుద్ధ స్మారకాన్ని చేరుకోవడంతో ర్యాలీ ముగుస్తుందని వివరించారు.

పొలాల దారి కబ్జా

- టీడీపీ నేత దుశ్చర్య


ఇది వరకు రైతుల పొలాలకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారి


దారిని ఆక్రమించేసి పంట సాగు చేసుకుంటున్న దృశ్యం

సాక్షి, పుట్టపర్తి: రామగిరి మండలంలో పొలాల కోసం ఏర్పాటు చేసుకున్న దారిని పరిటాల కుటుంబం అండ చూసుకుని కబ్జా చేశారు. శ్రీహరిపురం - దామాజిపల్లి మార్గంలోని 40 మంది రైతుల పొలాలకు దారి లేక ఇబ్బంది పడేవారు. రైతుల కష్టాలను గుర్తించిన సర్పంచ్ రెండు నెలల కిందట జేసీబీతో చదును చేయించి పొలాలకు దారి ఏర్పాటు చేయించారు. సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన- బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెలకు చెందిన టీడీపీ నేత జగన్నాథ్ వారం రోజుల కిందట తన అనుచరులతో వెళ్లి శ్రీహరిపురం - దామాజిపల్లి మార్గంలోని పొలాల దారిని కబ్జా చేశాడు. ట్రాక్టర్‌తో దున్నించి.. ఆ భూమిలోనే విద్యుత్ స్తంభాలు పాతించాడు. ప్రస్తుతం అందులో పంట సాగుకూడా చేశాడు. సమీపంలోని రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు గానీ, ట్రాన్స్‌కో అధికారులు గానీ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

'ప్రాథమిక బోధన మాతృభాషలోనే కొనసాగాలి'



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్

కొత్తచెరువు: ప్రాథమిక పాఠశాలలో బోధన మాతృభాషలోనే కొనసాగేలా చూడాలని ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్ కుమార్ మాట్లాడారు. విద్యావ్యవస్థకు నష్టం చేకూర్చేలా ఉన్న జీఓ 117ను వెంటనే రద్దు చేసి ప్రాథమిక విద్యావ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. 6 నుంచి 10 తరగతులకు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్ర, గౌరవ అధ్యక్షుడు పి.వి.మాధవ, సభ్యులు లతారామకృష్ణా, అంజనమూర్తి, రవీంద్రారెడ్డి, వెంకటనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి


మృతుడు శ్రీనివాసులు

మడకశిర రూరల్: ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం జీవీ పాళ్యం గ్రామానికి చెందిన శ్రీనివాసులు (16) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వెళుతూ బచ్చలయ్యపాళ్యం క్రాస్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ట్రాలీని ఢీకొన్నాడు. ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి తల్లి, అక్క ఉన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


మృతుడు నాగరాజు

ధర్మవరం అర్బన్: స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. వివరాలు.. ధర్మవరంలోని తారకరామాపురానికి చెందిన నాగరాజు (42) రైళ్లలో తిరుగుతూ తినుబండారాల విక్రయం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం తినుబండారాలను తీసుకుని స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకున్న ఆయన అప్పటికే ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరిన తిరుపతి రైలు ఎక్కే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో కాలు జారడంతో రైలు బోగికి ప్లాట్‌ఫాంకు మధ్యలో చిక్కుకుని తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.